సాక్షి అనంతపురం

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.22,560

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,560 పలికాయి.



ఏరివేత పక్కా

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందిన వారిలో టెన్షన్ మొదలైంది. 8లో

గరిష్టం/కనిష్టం
41.4°/21.9°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేసవితాపం కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన



బుక్కరాయసముద్రం: ఉమ్మడి జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 40.2–41.3, రాత్రి 23.9–24.7 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చన్నారు.

రూ.2.91 కోట్ల పంట నష్టం

అనంతపురం అగ్రికల్చర్: అకాల వర్షం, ఈదురు గాలుల కారణంగా సోమవారం సాయంత్రం రూ.2.91 కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, అనంతపురం, యల్లనూరు, ఉరవకొండ, కూడేరు, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, గుమ్మఘట్ట, గుంతకల్లు, పెద్దవడుగూరు మండలాల పరిధిలోని 29 గ్రామాల్లో అరటి, మామిడి, బొప్పాయి, కళింగర, మునగ తదితర పంటలు 95 హెక్టార్లలో దెబ్బతినడంతో 115 మంది రైతులకు రూ.1.50 కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అలాగే, శింగనమల, నార్పల, గార్లదిన్నె, కంబదూరు, బెళుగుప్ప మండలాల్లో 173 హెక్టార్లలో మొక్కజొన్న, వరి, పత్తి పంటలు దెబ్బతినడంతో 92 మంది రైతులకు రూ.1.41 కోట్ల నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

మెట్ట భూముల సాగుకు తోడ్పాటు : డ్వామా పీడీ

అనంతపురం టౌన్: మెట్ట భూముల్లో మామిడి, నిమ్మ, జామ, బత్తాయి, సపోటా తదితరాలు సాగు చేసేవారికి ఉపాధి హామీ పథకం ద్వారా తోడ్పాటునందిస్తామని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 8 వేల ఎకరాల మెట్ట భూముల్లో ఉద్యాన పంటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. ఐదు ఎకరాల్లోపు మెట్ట భూములున్న రైతులు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది మామిడి, చీనీ, దానిమ్మ, నిమ్మ, జామ, అల్లనేరుడు, డ్రాగన్ ఫ్రూట్, సపోట, అంజూర సాగుకు అవకాశం కల్పించినట్లు వివరించారు. రైతులే మొక్కలను కొనుగోలు చేసుకుంటే వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తామన్నారు. ఎకరా లోపు పొలం ఉన్న రైతులు సైతం మునగ, పూల మొక్కల సాగుకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

అక్రమాలకు పాల్పడొద్దు

అనంతపురం అర్బన్: పింఛన్ల పంపిణీలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పింఛను లబ్ధిదారులతో గౌరవంగా మాట్లాడాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కలవరపెడుతున్న మధుమేహం



- అనంతపురం నగరానికి చెందిన రంగనాథ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వయసు 32 ఏళ్లు. మూడేళ్ల క్రితం పెళ్లయింది. ఎందుకో అనుమానమొచ్చి ఇటీవల ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోగా షుగర్ ఉన్నట్లు తేలింది. దీంతో ఒక్కసారిగా అతను ఖిన్నుడయ్యాడు.
- నగరానికి చెందిన మటన్ వ్యాపారి గౌస్‌మొహిద్దీన్‌కు 37 ఏళ్లు కూడా లేవు. ఇద్దరు పిల్లలున్నారు. సరైన వ్యాయామం లేక ఒత్తిడికి గురై బీపీ, షుగర్ రెండూ వచ్చాయి. ఇటీవల సరిగా నిద్రపట్టడం లేదని బాధితుడు వాపోతున్నాడు.

వీరే కాదు.. ఉమ్మడి జిల్లాలో మధుమేహం, రక్తపోటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

- ఉమ్మడి అనంతలో చాపకింద నీరులా విస్తరిస్తున్న షుగర్ వ్యాధి
- 22 శాతానికి పైగా బాధితులు
- వందలో 28 మందికి రక్తపోటు
- అవగాహన లేక గ్రామీణులూ బాధితులవుతున్న వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మధుమేహ జబ్బు చాపకింద నీరులా విస్తరిస్తోంది. జనాభా పెరుగుదల రేటుతో పోల్చి చూస్తే డయాబెటిక్ బారిన పడుతున్న వారే ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. యువకులు సైతం జీవనశైలి జబ్బుల బారిన పడుతుండటం ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో 40 ఏళ్లు నిండిన వారిలో ఎక్కువగా ఆయా జబ్బుల బారిన పడేవారు. కానీ, ఇటీవల 30 ఏళ్లు దాటని వారూ వీటి కోరల్లో చిక్కుతున్నారు. ఈ విషయం వైద్యులను కూడా విస్మయానికి గురి చేస్తోంది.

గ్రామీణులూ బాధితులే..

మధుమేహం, రక్తపోటు తదితర జబ్బులతో బాధపడే వారు ఒకప్పుడు పట్టణాలు, నగరాల్లోనే ఎక్కువగా ఉండేవారు. పని ఒత్తిడితో సతమతమవడం కారణంగా వీటి బారిన పడేవారు. కానీ, ఇప్పుడు ఆయా రోగాలు పల్లెలకూ విస్తరించడం గమనార్హం. ఈ క్రమంలోనే డయాబెటిక్, బీపీ మందుల ధరలు పెరగడం సామాన్యులకు కొరకరాని కొయ్యగా మారింది.

అవగాహన లేకే..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) బాధితులు 27 శాతం పైగానే ఉన్నట్టు తేలింది. పట్టణాల్లో అయితే ఇది 30 నుంచి 32 శాతం కూడా ఉన్నట్టు తాజా సర్వేలో వెల్లడైంది. ఇక.. షుగర్, హైపర్‌టెన్షన్ జబ్బులు నియంత్రణలో లేనివారు ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలో శరీరంలో ఇతర అవయవాలపై ప్రభావం పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జబ్బుల నియంత్రణపై అవగాహన లేకపోవడం అనర్థాలకు దారి తీస్తోంది.

సమస్యలెన్నో..

- షుగర్ నియంత్రణలో లేకుంటే కిడ్నీ సమస్యలు తలెత్తుతాయి.
- కంటిచూపుపై దుష్ప్రభావం పడుతుంది.
- శరీరంలో గాయాలైనప్పుడు మానడం చాలా కష్టం.
- మధుమేహం అదుపులో లేకపోతే గుండె జబ్బులొచ్చే అవకాశాలు ఎక్కువ.
- అధిక రక్తపోటు వల్ల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది.
- నరాల వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుంది.

ఉమ్మడి జిల్లాలో వివరాలిలా..

కేటగిరీ	శాతం
మధుమేహ బాధితులు	22.7
హైపర్ టెన్షన బాధితులు	27.4
రెండు జబ్బులతో ఉన్నవారు	19.1
ఉమ్మడి జిల్లా జనాభా	41,15,783
30 ఏళ్లు పైబడిన వారు	20,19,938
డయాబెటిక్ బాధితులు	4,64,585
హైపర్ టెన్షన్ బాధితులు	5,45,383
మందుల షాపులు	2,250
షుగర్, బీపీ మందుల విక్రయ వాటా	31 శాతం

అలవాట్లు మార్చుకోవాలి



మధుమేహం, హైపర్ టెన్షన్ ఉన్న వారు జాగ్రత్తలు తీసుకోవాలి. బాధితులు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా లేని ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఆరోగ్యానికి మేలు. పొగ తాగడం చాలా ప్రమాదకరం.

–డా.సుధాకర్‌రెడ్డి, గుండె వైద్య నిపుణులు

సమ్మె బాటలో ఎంఎల్‌హెచ్‌పీలు

- స్తంభించిపోనున్న ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ సేవలు



ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

అనంతపురం మెడికల్: మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీ) సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవలు (గతంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు) స్తంభించిపోనున్నాయి. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో ఎన్‌హెచ్‌ఎం ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గణేష్, కార్యనిర్వహణ కార్యదర్శి షేబా ప్రియాంక, కోశాధికారి గౌరి మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు 23 శాతం జీతం పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వులకు అతీగతి లేకుండా పోయిందని, ఆరేళ్లుగా పని చేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రెగ్యులరైజేషన్, జాబ్ చార్ట్ తదితర వాటిపై స్పష్టత లేదన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం ఆన్‌లైన్ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. 17న పీహెచ్‌సీల వద్ద ధర్నా, 19న డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన, 21న పోస్టుకార్డు ఉద్యమం, 22న జిల్లా కేంద్రంలో ధర్నా, 24న నిరవధిక సమ్మెలోకి వెళ్తామని వెల్లడించారు.

స్వల్పంగా పెరిగిన స్కేల్ ఆఫ్ రిలీఫ్

అనంతపురం అగ్రికల్చర్: ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆస్తి, పంట, పశువులు, జీవాలు, కోళ్ల నష్టానికి వర్తింపజేసే ఎక్స్‌గ్రేషియా (స్కేల్ ఆఫ్ రిలీఫ్) స్వల్పంగా పెంచుతూ రాష్ట్ర ప్రకృతి విపత్తుల విభాగం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనల ప్రకారం ప్రతి రెండు, మూడు సంవత్సరాలకు స్కేల్ ఆఫ్ రిలీఫ్ ఖరారు చేస్తారు. ఈ క్రమంలోనే తాజాగా ఉత్తర్వులు ఇచ్చారు. పెరిగిన స్కేల్ ఆఫ్ రిలీఫ్ 2024 ఆగస్టు నుంచి వర్తిస్తుందని పేర్కొన్నారు.

- పాడి ఆవు లేదా గేదె చనిపోతే రూ.50 వేలు, ఎద్దుకు రూ.40 వేలు, దూడలకు రూ.25 వేలు, గొర్రెలు, మేకలకు రూ.7,500, కోడికి రూ.100 ప్రకారం గరిష్టంగా రూ.10 వేలు, పశువుల పాక నష్టానికి రూ.5 వేల ప్రకారం వర్తింపజేశారు.
- మనిషి చనిపోతే రూ.5 లక్షలు, ఇళ్లు కూలినా, దెబ్బతిన్నా రూ. 10 వేలు, కిరాణా కొట్టుకు రూ.25 వేలు, రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ కలిగిన కుటీర పరిశ్రమలకు రూ.50 వేలు, రూ.1.50 కోట్లలోపు టర్నోవర్ కలిగిన వాటికి రూ.లక్ష, రూ.ఒకటిన్నర కోటికి పైగా టర్నోవర్ కలిగిన వాటికి రూ.1.50 లక్షలు, ద్విచక్రవాహనాలకు రూ.3 వేలు, త్రిచక్ర వాహనాలకు రూ.10 వేలు, తోపుడు బండ్లకు రూ.20 వేలు, చేనేతలకు రూ.25 వేలు, పాక్షికంగా బోట్లు దెబ్బతింటే రూ.9 వేలు, వలలకు రూ.5 వేలు, బోట్లు, వలలు పూర్తిగా దెబ్బతింటే రూ.20 వేలు, మోటార్ బోట్లు, వలలు దెబ్బతింటే రూ.25 వేలు, చేపల చెరువుకు రూ.18 వేలు, పట్టు రైతులకు 25 వేల ప్రకారం నష్ట ఉపశమనం వర్తింపజేస్తారు.
- వేరుశనగ, పత్తి, వరి, చెరకు హెక్టారుకు రూ.25 వేల ప్రకారం లెక్కకట్టి ఇస్తారు. సజ్జ, మినుము, పెసర, మొక్కజొన్న, రాగి, కంది, కుసుమ, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పొగాకు, ఆముదం, కొర్ర, సామ, జూట్ పంటలు హెక్టారుకు రూ.15 వేల ప్రకారం స్కేల్ ఆఫ్ రిలీఫ్ ఖరారు చేశారు.
- అరటి,మామిడి, దానిమ్మ, జామ, ఉసిరి, సపోటా, రేగు, డ్రాగన్ ఫ్రూట్, జీడిపప్పు, కాఫీ, పసుపు, మిరపహెక్టారుకు రూ.35 వేలు,కళింగర,కర్బూజా, దోస, బొప్పాయి, టమాట, పూలు, ఉల్లి, ధనియాలు, కూరగాయలకు రూ.25 వేలు, సెంటు విస్తీర్ణంలో ఉన్న ఆకుతోటలకు రూ.300 ప్రకారం గరిష్ఠంగా రూ.75 వేల వరకు ఇస్తారు. కర్రపెండలం రూ.10 వేలు, ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.1,500 ప్రకారం ఖరారు చేశారు.



ఇటీవల ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి పంట

యువతలో నైపుణ్యాలు పెంపొందించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఉపాధి కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను పెంపొందించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాబ్‌మేళాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా నైపుణ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్‌కు సంబంధించి 8 జాబ్‌మేళాలు నిర్వహించాల్సి ఉందన్నారు. నైపుణ్యాభివృద్ధిపై కార్యాచరణ పక్కాగా అమలు చేయాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లకు పరిశ్రమలను అనుసంధానించాలన్నారు. 'పీఎం విశ్వకర్మ యోజన' కింద శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇప్పటికే పథకం ద్వారా 205 బ్యాచ్‌ల్లో 6 వేల మందికి శిక్షణ ఇచ్చారని, 111 మందికి శిక్షణ కొనసాగుతోందన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కింద కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ ల్యాబ్ ఏర్పాటు పనులు వేగంగా చేపట్టాలన్నారు. అనంతరం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసిక జాబ్‌మేళా క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతపురం అర్బన్‌కు సంబంధించి ఏప్రిల్ 25న, రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి మే 2న, కళ్యాణదుర్గానికి సంబంధించి మే 16, రాయదుర్గం మే 23, గుంతకల్లు మే 30, తాడిపత్రి జూన్ 6, శింగనమల జూన్ 13, ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించి జూన్ 27న జాబ్‌మేళా నిర్వహిస్తారన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి, జేఎన్‌టీయూ ప్లేస్‌మెంట్ సీఈఓ శ్రీనివాసులు, ఎస్‌కేయూ అధికారి సీహెచ్‌కృష్ణ, మెప్మా పీడీ విశ్వజ్యోతి, పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసయాదవ్, జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, జేడీఎం సూర్యనారాయణ, కార్మిక శాఖ ఏసీ రమాదేవి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి, రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



జాబ్‌మేళా క్యాలెండర్ విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

'ఉల్లాస్' లక్ష్యం సాధించాలి

'ఉల్లాస్' కార్యక్రమం కింద నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16 నుంచి ఆరు రోజుల పాటు సర్వే నిర్వహించి నిరక్షరాస్యులను గుర్తించాల్సి ఉందన్నారు. మే 5 నుంచి సెప్టెంబరు వరకు అక్షరాస్యత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో వయోజన విద్య డీడీ ఆంజనేయులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొదటి సంతకంతోనే మోసం



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు

- నిరుద్యోగులను వంచించిన చంద్రబాబు
- డీఈఓ ఆఫీస్‌ను ముట్టడించిన డీఎస్సీ అభ్యర్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో మొదటి సంతకంతోనే డీఎస్సీ అభ్యర్థులకు చంద్రబాబు మోసం చేశారని డెమొక్రటిక్ యూత్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్‌ఐ) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ అభ్యర్థులతో కలిసి మంగళవారం అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ పది నెలలు గడిచినా ముఖ్యమంత్రి మొదటి సంతకాన్ని అమలు చేసే పరిస్థితి లేనప్పుడు వారంలోనే మెగా డీఎస్సీని విడుదల చేస్తామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి అనేక ప్రకటనలతో నిరుద్యోగులను దారుణంగా మోసం చేశారన్నారు. వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. అప్పటికీ దిగిరాకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలను అడ్డుకుంటామన్నారు. అనంతపురం జిల్లాకు డీఎస్సీలో వెయ్యి ఎస్జీటీ పోస్టులు పెంచాలన్నారు. జిల్లా అభ్యర్థులందరికీ ఒకే పేపర్ ఉండేలాగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కూడా ద్వితీయ ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయాలన్నారు. అనంతరం డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నూరుల్లా, సురేంద్రబాబు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిద్దు, పరమేష్, తరిమెల గిరి, భీమేష్, సాయి పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తే కేసులే..

- ఉరవకొండ రూరల్ సీఐ చిన్నగౌస్ వివాదాస్పద వ్యాఖ్యలు

ఉరవకొండ: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తే కేసులు నమోదు చేయాల్సి ఉంటుందంటూ ఉరవకొండ రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్ హెచ్చరించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఉరవకొండ పట్టణంలోని బీబీ జైనబ్బీ దర్గాలో రెండు రోజుల క్రితం సీఐ అధ్యక్షతన మైనార్టీల సమావేశం జరిగింది. అనధికారికంగా జరిగిన ఈ సమావేశానికి మత పెద్దలతో పాటు ముస్లింలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సీఐ చిన్నగౌస్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. రాజకీయంగా దీన్ని వాడుకోవాలని చూస్తే కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని బెదిరించారు. మైనార్టీల అభివృద్ధి కోసం మంత్రి పయ్యావుల కేశవ్ కృషి చేస్తున్నారని, టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి సాధ్యమవుతుందంటూ టీడీపీ నాయకుడి తరహాలో సీఐ మాట్లాడడం చర్చనీయాంశమైంది.

అధికార పార్టీకి తొత్తుగా..

సీఐ సయ్యద్ చిన్నగౌస్ టీడీపీ తొత్తుగా పనిచేస్తున్నారనే విమర్శలున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో సైతం ఉరవకొండలో టీడీపీ గెలుపు కోసం పార్టీ అభ్యర్థితో సమానంగా వ్యూహాలు రచించి అమలు చేశారని ఆ పార్టీ ముఖ్య నేతలే చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కొందరు నాయకులను సీఐ బెదిరించి టీడీపీ కండువా వేసుకునేలా చేయడంతో పాటు ఉరవకొండలో తాను చెప్పిందే వేదమనేలా వ్యవహరిస్తున్నారు.

రాజకీయ అరంగేట్రం కోసమేనా?

మంత్రి కేశవ్‌కు నమ్మిన బంటుగా పేరు గాంచిన సీఐ చిన్నగౌస్ మరో నెలలో ఉద్యోగ విరమణ చేయబోతున్నారు. అనంతరం రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే మొదటిసారిగా ముస్లింలతో సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. త్వరలో అన్ని సామాజిక వర్గాలతోనూ సమావేశాలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో ఇప్పటికే సీఐ గౌస్ తనదైన శైలిలో టీడీపీ నేత తరహాలో చక్రం తిప్పుతున్నట్లు విమర్శలున్నాయి.



ముస్లింలతో కలిసి జైనబ్బీ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న సీఐ చిన్నగౌస్ (ఫైల్)

క్లుప్తంగా

జిల్లా జడ్జికి ఘన సన్మానం



జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎస్పీ పి. జగదీష్

అనంతపురం: ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సేవలు ప్రశంసనీయమని ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. బదిలీపై వెళ్తున్న జడ్జి జి.శ్రీనివాస్‌ను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మార్గదర్శకంలో జిల్లా పోలీసు, న్యాయశాఖలు పరస్పర సహకారంతో బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేశాయన్నారు. కఠిన నేరాల్లో ముద్దాయిలకు కఠిన శిక్షలు వేయడాన్ని గుర్తు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట అటవీ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... శింగనమల మండలం జలాలపురం గ్రామానికి చెందిన గిరిస్వామి (60) మంగళవారం వ్యక్తిగత పనిపై తాడిపత్రికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన ముచ్చుకోట అటవీ ప్రాంతంలో ప్రయాణిస్తుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన గిరిస్వామిని అటుగా వెళుతున్న వారు గుర్తించి వెంటనే అనంతపురంలోని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

గుండెపోటుతో విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

యల్లనూరు: మండలంలోని పాతపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటకొండారెడ్డి(86) సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. మండలంలోని జంగంపల్లి, పాతపల్లి, కాచర్లకుంట తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో ఆయన ఉపాధ్యాయుడుగా విధులు నిర్వర్తించారు. వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురంలో స్థిరపడిన ఆయన అకాల మృతితో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన అంత్యక్రియలను స్వగ్రామం పాతపల్లిలో నిర్వహించారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

- ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందిన వారిలో కలవరం
- ఇప్పటికే రాజీనామా చేసిన ఓ అంగన్‌వాడీ టీచర్
- విచారణకు ముందుగానే రాజీనామా చేద్దామనే యోచనలో మరికొందరు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

ఏరివేత పక్కా!

తాడిపత్రి రూరల్: ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం ఐసీడీఎస్‌ను కుదిపేస్తోంది. ఫేక్ సర్టిఫికెట్లతో అంగన్‌వాడీ టీచర్లుగా, ఆయాలుగా ఉద్యోగాలు పొందిన వారిలో కలవరం మొదలైంది. ఐసీడీఎస్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు తాడిపత్రిలోని ఆ శాఖ కార్యాలయంలో మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలోని తాడిపత్రి టౌన్, తాడిపత్రి మండలం, పెద్దపప్పూరు, యాడికి, పెద్దవడుగూరు మండలాలకు చెందిన దాదాపు 302 అంగన్‌వాడీ సెంటర్లకు చెందిన టీచర్లు, ఆయాలు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకుని తమ పదవ తరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్లు, ఉద్యోగం పొందిన ఆర్డర్ కాపీలను ఒరిజనల్‌తో పాటు గెజిటెడ్ సంతకంతో కూడిన జిరాక్స్ కాపీలను అందజేసేందుకు తరలిరావడంతో కార్యాలయం మంగళవారం కిక్కిరిసింది. సూపర్‌వైజర్లు తమకు కేటాయించిన క్లస్టర్ పరిధిలోని టీచర్లు, ఆయాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనలో నిమగ్నమయ్యారు.

రాష్ట్రాన్ని కుదిపేసిన తాడిపత్రి ఘటన

ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ కార్యాలయాల పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సంబంధించిన ఫేక్ సర్టిఫికెట్ల డొంక కదులుతోంది. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టులో ప్రారంభమైన ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా విచారణకు కారణమైంది. ప్రకాశం జిల్లాలోనూ పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందినట్లుగా గుర్తించిన అధికారులు అక్కడ సైతం విచారణ చేపట్టారు. దీంతో తాడిపత్రి ప్రాజెక్ట్‌లో కొందరు కోర్టును ఆశ్రయించిన తరహాలోనే అక్కడి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హైకోర్టు మెట్లు ఎక్కారు. ఇది కాస్త ఐసీడీఎస్ డైరెక్టరేట్‌కు తలనొప్పి మారడంతో ఈ వివాదానికి పుల్‌స్టాప్ పెట్టేలా ఫేక్ సర్టిఫికెట్లను సమర్పించి ఉద్యోగం పొందిన టీచర్లు, ఆయాలను తొలగించేందుకు సిద్ధమైంది. ఈ విచారణ బాధ్యతను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అప్పగించడంతో సర్టిఫికెట్ల పరిశీలన వేగవంతమైంది.



స్పష్టమైన ఆదేశాలు జారీ

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూపర్‌వైజర్లకు స్పష్టమైన అదేశాలు అందాయి. గతంలో వెలుగు చూసిన ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారంపై అప్పట్లో జిల్లా ఐసీడీఎస్ అధికారులు చేపట్టిన పరిశీలన ప్రక్రియ కాస్త యూనియన్ నాయకుల ఒత్తిళ్ల కారణంగా నీరుగారిపోయింది. పలు కారణాలు చూపుతూ అప్పట్లో ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారు శాఖపరమైన చర్యల నుంచి తప్పించుకున్నారు. తాజాగా ఈ వివాదం రాష్ట్రస్థాయి సమస్యగా మారడంతో స్వయంగా డైరెక్టరేట్ జోక్యం చేసుకుని పునర్విచారణకు ఆదేశించడంతో అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకూ అక్రమార్కులకు అండగా నిలిచిన వారు సైతం చేతులెత్తేశారు.

రాజీనామా బాటలో..

వ్యక్తిగత కారణాల పేరుతో ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్ ఒకరు రాజీనామా చేశారు. అయితే ఫేక్ సర్టిఫికెట్ల కారణంగా శాఖాపరమైన చర్యలు తీసుకుంటే ఉన్న పరువు కాస్త పోతుందన్న ఆలోచనతో ఆమె రాజీనామా చేసినట్లుగా వదంతులు వ్యాపించాయి. ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన మరికొందరు కూడా ఈ వ్యవహారం నుంచి బయటపడేందుకు యూనియన్ నాయకులతో మంతనాలు జరుపుతుండగా, మరికొందరు పరువు పోకుండా ముందస్తుగానే రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి వారు తొలిరోజు సర్టిఫికెట్ల పరిశీలనకు దూరంగా ఉన్నట్లు సమాచారం.

చర్యలు తప్పవు



డైరెక్టరేట్ ఆదేశాల మేరకు ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన టీచర్లు, ఆయాలపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు వారి వద్ద ఉన్న సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ చేపట్టాం. ఎలాంటి వివక్ష చూపకుండా సర్టిఫికెట్లను పరిశీలించాలని సూపర్‌వైజర్లను ఆదేశించాం. ఫేక్‌సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందారని నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తప్పవు. ఈ నెల 22వ తేదీ లోపు సర్టిఫికెట్లు అందజేయాలి. అందజేయని వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫారసు చేయనున్నాం.

– సాజిదాబేగం, సీడీపీఓ, తాడిపత్రి ప్రాజెక్టు

పీ4 పేరుతో చంద్రబాబు వంచన

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో పీ4 అమలుతో పేదరికం పోగొడతానంటూ ప్రజలను సీఎం చంద్రబాబు వంచనకు గురి చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. అనంతపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ మోదీ, చంద్రబాబు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల కారణంగా పేదలు, ధనవంతుల మధ్య తారతమ్యం పెరుగుతోందన్నారు. దేశ, రాష్ట్ర సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ పేదరికం పెంచుతున్నట్లుగా గొప్పలకు పోతున్నారని విమర్శించారు. వక్ఫ్ చట్టం సవరణ పేరుతో రాజ్యాంగం, లౌకికవాదంపై కేంద్రంలోని కూటమి ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. ఇది ఇక్కడితో ఆగదని, ముస్లింల తర్వాత చర్చిల భూములు, ఆటు తర్వాత హిందు ఆలయాల భూములపై కేంద్ర ప్రభుత్వం ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తుందన్నారు.



కదదరకుంటలో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న రామకృష్ణ

దెబ్బతిన్న పంటలపై శ్రద్ధ చూపని ప్రభుత్వం

కూడేరు: ప్రకృతి వైపరీత్యాలతో అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో దెబ్బతిన్న తోటలు, ఇతర పంటలపై నష్టం అంచనా వేయించి ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని రామకృష్ణ మండిపడ్డారు. మంగళవారం ఆయన కూడేరు మండలం ముద్దలాపురం, కడదరకుంట, చోళసముద్రం గ్రామాల్లో పర్యటించి, మూడు రోజుల క్రితం పెనుగాలులు, వర్షానికి దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న పంటలను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.35 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేస్తోందని, అయితే ఈ సాయం రైతులకు ఏ లెక్కన సరిపోదన్నారు. పంటను బట్టి నష్టపరిహారం అందివ్వడంతో పాటు మళ్లీ ఉద్యాన పంటలు సాగుకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు కేశవరెడ్డి, గోపాల్, రమణ, రాజేష్‌గౌడ్, కుళ్లాయిస్వామి, కృష్ణుడు, ఆంజనేయులు, సంగప్ప, మలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవాకు లైనింగ్ వద్దు

- ఏఐకేకేఎంఎస్ నాయకుల డిమాండ్
- పనులు ఆపి, కాలువ వెడల్పు చేయాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐకేకేఎంఎస్ నాయకులు, రైతులు

అనంతపురం అర్బన్: హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ పనులు చేపట్టి రైతుల బతుకులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఏఐకేకేఎంఎస్ (అఖిల భారత వ్యవసాయ కూలీ సంఘం) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గిరీష్, నాగముత్యాలు మండిపడ్డారు. లైనింగ్ కారణంగా భూగర్భజలాలు అడుగంటి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే లైనింగ్ పనులు ఆపి, కాలువ వెడల్పు పనులు చేపట్టాలని, హంద్రీ-నీవాకు 40 టీఎంసీల నీటిని కేటాయించాలనే డిమాండ్లతో సంఘం ఆధ్వర్యంలో నాయకులు, రైతులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ చేపట్టడమంటే రైతులకు భవిష్యత్తు లేకుండా చేయడమేనని మండిపడ్డారు. హంద్రీ-నీవా కాలువ పరిసరాల్లోని వై.కొత్తపల్లి, పంపనూరు, పంపనూరు తండా, వేపచెర్ల గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగడంతో రైతులు పంటలు పండించుకోగలుగుతున్నారని తెలిపారు. ఫేజ్-2లో భాగంగా హంద్రీ-నీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ చేపట్టడం ద్వారా భూగర్భజలాలు అడుగంటి పండ్ల తోటలు, ఇతర పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రనష్టపోతారన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతుందన్నారు. రైతులు వ్యవసాయం వదులుకుని ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని లైనింగ్ పనులు ఆపి, 8వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యంతో కాలువను వెడల్పు చేయాలని, ఏటా 40 టీఎంసీల నికర జలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, నాయకులు వెంకటేష్ నాయక్, రమేష్, రామకృష్ణ, ఎర్రిస్వామి, రైతులు పాల్గొన్నారు.

'కామన్ సీనియారిటీ వర్తింపజేయాలి'



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని డీఎస్సీ 2008 హామీ పత్ర ఉపాధ్యాయులకు కామన్ సీనియార్టీ అమలు చేయాలని ఏపీటీఎఫ్(1938) నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'టిస్'లో బాధిత ఉపాధ్యాయులకు ఎడిట్ ఆప్షన్ కల్పించాలన్నారు. 2023 వేసవి సెలవుల్లో ఇండక్షన్ ట్రైనింగ్‌లో మొదటి మూడు విడతలకు హాజరైన డీఎస్సీ 1998, 2008 ఉపాధ్యాయులకు మాత్రమే ఐదు రోజుల వేతనం మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చారని, 4, 5 విడతలకు హాజరైన డీఎస్సీ 1998, 2008 ఉపాధ్యాయులకు కూడా ఐదు రోజుల వేతనం మంజూరుకు ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఈఓ స్పందిస్తూ త్వరగతిన ఉత్తర్వులు విడుదల చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస నాయక్, డీఎస్సీ 2008 హామీ పత్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ ఏర్పాటు చేసిన కార్యవర్గం చెల్లదు

- ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌రాజు, ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) మాజీ అధ్యక్షుడు, సంఘ బహిష్కృతుడు సూర్యనారాయణ ఇటీవల ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గం చెల్లదని ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీకాంత్ రాజు, ప్రధాన కార్యదర్శి జి.ఆస్కార్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన వారు నగరంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పెద్దలను సూర్యనారాయణ మోసగించి, సానుభూతితో ఆయనపై ఉన్న క్రిమినల్ కేసును రద్దు పరచుకున్నారన్నారు. వ్యక్తిగత సమస్యలు, రాజకీయ ఎదుగుదలకు ఉద్యోగ నాయకుడి అవతారం ఎత్తారని మండిపడ్డారు. గత ఏడాది జూన్ 2న పారిపోయి 6 నెలలు దాక్కుని సుప్రీం కోర్టు మంజూరు చేసిన అన్టిసిపేటరీ బెయిల్ పొందిన తర్వాత నవంబర్‌లో బయట తిరిగిన వ్యక్తికి ఎలా డ్యూటీ పీరియడ్ ఇస్తారని వాణిజ్య పన్నుల శాఖ అధికారులను ప్రశ్నించారు. ఆయన సస్పెన్షన్‌ను రద్దు చేయడం, పూర్తికాలం జీతాన్ని మంజూరు చేయడం సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని నిబంధనలు అతిక్రమించిన సూర్యనారాయణ, ఆయనకు సహకరించిన వాణిజ్య పన్నుల అధికారులపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన కేసుల మాఫీపై త్వరలో న్యాయ పోరాటం చేస్తామని, లోకాయుక్తకు సైతం ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి రమణ కుమార్, బాబా సాహెబ్, శ్రీనివాస్, గోవిందు, సుధాకర్, వెంకటేశులు, కృష్ణమూర్తి, రాజు, పార్థసారథి, ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, కళ్యాణ్, డి.మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వడ్డీతో రుణాలు రెన్యువల్ చేయండి

- బ్యాంకర్లకు రైతు సంఘం వినతి పత్రం



ఎస్‌బీఐ అధికారికి వినతి పత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు సంబంధించి బ్యాంకుల్లో బంగారు నగల తాకట్టు రుణాలతో పాటు పంట రుణాలను కేవలం వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలని బ్యాంకర్లకు ఏపీ రైతు సంఘం నాయకులు విన్నవించారు. ఈ మేరకు... రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎం.బాలరంగయ్య, ఎం.కృష్ణమూర్తి, బీహెచ్ రాయుడు, వలీ తదితరుల బృందం ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు, ఏపీజీబీ, యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్లను మంగళవారం కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరువు పరిస్థితులు ఏర్పడటంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పెట్టుబడిసాయం లాంటివి అందక రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బంగారు రుణాలు, పంట రుణాలు పూర్తిగా చెల్లించి రెన్యువల్ చేసుకోవాలంటే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. దీని వల్ల రైతులు మరింత కష్టాల్లో పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పట్ల మానవత్వంతో వ్యవహరించి కేవలం వడ్డీ కట్టించుకుని రుణాలను రెన్యువల్ చేయాలని కోరారు. అసలు, వడ్డీ చెల్లించాలని బలవంతం చేయడం మంచిదికాదన్నారు. ఖరీఫ్ వస్తున్నందున బ్యాంకుల్లో ఇక నుంచి జోరుగా రెన్యువల్ కొనసాగుతాయన్నారు. బ్యాంకుల వద్ద తాగునీరు, నీడ సదుపాయం కల్పించాలని కోరారు. బ్యాంకుల్లో వచ్చిన సర్క్యులర్లు, నోటీసులు తెలుగులో ముద్రించి పెట్టాలన్నారు. ప్రతి రైతుకూ కిసాన్ క్రెడిట్ కార్డు అందించాలని, మార్టిగేజ్ లేకుండా రూ.5 లక్షల వరకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు.

రైతుల సమస్యలు పట్టని బ్యాంక్ అధికారులు



బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

బ్రహ్మసముద్రం : మండలంలోని వేపులపర్తి గ్రామంలోని యూనియన్ బ్యాంక్ అధికారులకు రైతుల సమస్యలు పట్టడం లేదని మండల వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు గోపాలరెడ్డి, రైతులు మండిపడ్డారు. పంట రుణాల రెన్యువల్‌లో బ్యాంక్ అధికారుల అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం యూనియన్ బ్యాంక్ ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలరెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం రైతులు తీసుకున్న పంట రుణాల రెన్యువల్ జరుగుతున్నాయని జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో రైతుల నుంచి కేవలం వడ్డీ మాత్రమే తీసుకుని రుణాలను రెన్యువల్ చేస్తున్నారని తెలిపారు. అయితే స్థానిక యూనియన్ బ్యాంక్ అధికారులు మాత్రం రుణం మొత్తం చెల్లించాల్సిందేనంటూ వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి రైతుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తున్న బ్యాంక్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గిన్నిస్ బుక్‌లో రైల్వే ఉద్యోగికి చోటు



అవార్డును అందుకుంటున్న సునీల్‌కుమార్

గుంతకల్లు: స్థానిక భాగ్యనగర్‌కు చెందిన రైల్వే ఉద్యోగి సునీల్‌కుమార్‌కు గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కింది. చైన్నెలో ఉద్యోగం చేస్తున్న ఆయన గత ఏడాది డిసెంబర్ 1న 1,090 మంది విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు గంట పాటు కీబోర్డు వాయించి అందరినీ ఆకట్టుకున్నారు. దీంతో సోమవారం హైదరాబాద్‌లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అతిథులుగా పాస్టర్ అనిల్ కుమార్, అగస్టిన్ దండింగి చేతుల మీదుగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు పత్రాన్ని ఆయన అందుకున్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుహోళ గ్రామంలో టీడీపీ నేత సోమన్నగౌడ్‌పై హత్యాయత్నం చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్‌ఐ నబీరసూల్ వెల్లడించారు. గ్రామానికి చెందిన హనుమక్కతో పదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చిన సోమన్నగౌడ్ చివరకు అమెకు అన్యాయం చేసి, మతిస్థిమితం కోల్పోయేలా చేశాడని, దీంతో గ్రామంలో పరువు పోయిందన్న అక్కసుతో సోమన్న గౌడ్‌పై హనుమక్క మేనల్లుడు గోవిందు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వన్నప్ప సహకారంతో ఆదివారం రాత్రి తన ఇంటి ఎదుట నిద్రిస్తున్న సోమన్నపై పిడిబాకుతో దాడి చేశారు. సోమన్నగౌడ్ కేకలు వేయడంతో పరారయ్యారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... మంగళశారం ఉదయం నేమకల్లు గ్రామ రహదారిలో తచ్చాడుతున్న గోవిందు, వన్నప్పను అరెస్ట్ చేసి, పిడిబాకు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా...రైతు మృతి



కందకూరు వద్ద ప్రమాదానికి గురైన ఆటో

రాప్తాడు రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ రైతు మృతిచెందాడు. పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన పలువురు మంగళవారం ఉదయం వ్యక్తిగత పనిపై అదే గ్రామానికి చెందిన దూదుకుల భక్తర్ ఆటోలో అనంతపురానికి బయలుదేరారు. గ్రామ శివారులోని సచివాలయం దాటిన తర్వాత రోడ్డు పక్కన మట్టి లేకపోవడంతో కిందకు దిగిన ఆటో తిరిగి రోడ్డు ఎక్కే క్రమంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో రైతు ఎర్రముద్దయ్యగారి వెంకట్రాముడు (59) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన పలువురిని స్థానికులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై ఇటుకలపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

15 మంది విద్యార్థులకు గాయాలు

బొమ్మనహాళ్: పాఠశాల విద్యార్థులను తరలిస్తున్న ఆటో బోల్తా పడడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. వివరాలు.. బొమ్మనహాళ్ మండలం కానాపురం, కొత్తూరు గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు డి.హీరేహాళ్ మండలం సోమలాపురంలోని ప్రఝురుబుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో రోజూ ఆటోలో పాఠశాలకు వెళ్లి వచ్చేవారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమైన విద్యార్థులు.. కానాపురం సమీపంలోని మలుపు వద్ద డ్రైవర్ చంద్ర వేగ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో విద్యార్థులు శ్రీకాంత్, కావ్య, జయలత, భూమిక, గణేష్, హుసేన్, పర్వీన్, కావేరి, మహాలక్ష్మి, ఈశ్వరమ్మ, సింధు, శంకర్, సంతోష్, అభయ్, నరేష్ తదితరులు గాయపడ్డారు. గాయపడిన విద్యార్థులను స్థానికులు బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు.

నేడు బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల సేవా శిబిరం

అనంతపురం సిటీ: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్‌ఎన్‌ఎల్) వినియోగదారుల సమస్యల పరిష్కార శిబిరం బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ డివిజనల్ ఇంజినీర్ డి.గోపాల్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కస్టమర్ సర్వీస్ మాసంలో భాగంగా అనంతపురంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న వేమన భవన్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నారు. మొబైల్ సిమ్ సేవలు, ఎఫ్‌టీటీహెచ్(ఫైబర్ ఇంటర్నెట్), ఇతర సేవలకు సంబంధించిన సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చు.

క్లుప్తంగా

డిప్యూటీ కమిషనర్‌గా డాక్టర్ పావని

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా డాక్టర్ డీ పావని నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవావారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉన్న ఈమెను అనంతపురానికి ప్రభుత్వం బదిలీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎం వెంకటేశ్వర్లు హిందూపురం అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

బంగారు రుణాలను వడ్డీతో రెన్యూవల్ చేయాలి



చెన్నేకొత్తపల్లిలో కెనరాబ్యాంకు ముందు నిరసన తెలుపుతున్న రైతులు

చెన్నేకొత్తపల్లి: రైతులు కరువుతో అల్లాడుతున్నారని, బంగారు రుణాలను వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలని స్థానిక కెనరా బ్యాంకు ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రైతు సంఘం నేత లింగన్న మాట్లాడుతూ కరువు నేపథ్యంలో రైతులు మొత్తం రుణం చెల్లించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. బ్యాంకు అధికారులు స్పందించి వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలని కోరారు. అనంతరం మెనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మేనేజర్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

'ఆ మట్టిని నేను తోలలేదు'



ఆత్మకూరు వద్ద టిప్పర్లతో తరలిస్తున్న మట్టి

ఆత్మకూరు: వడ్డుపల్లి వద్ద అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సాక్షి పత్రికలో మంగళవారం కథనం వెలువడింది. ఈ విషయంపై టీడీపీ మండల మాజీ కన్వీనర్ కృష్ణమోహన్‌చౌదరి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి తాను అక్రమంగా తరలిస్తున్నానని ఉద్దేశపూర్వకంగా రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు గిట్టని వారు దుష్ప్రచారం చేశారన్నారు. తాను ఎలాంటి మట్టి తరలించలేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆత్మకూరు బైపాస్ సమీపంలో మట్టి తరలిస్తుంటే వడ్డుపల్లి వద్ద తరలిస్తున్నానని తనపై గిట్టని వారు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేశారని తెలియజేశారు. సంబంధిత అధికారులు విచారణ చేసి మట్టి తరలిస్తే చర్యలు తీసుకొవచ్చని ఆయన పేర్కొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



ముస్లిం కుటుంబాలకు నిత్యావసర వస్తువులందిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు నేతృత్వంలో నడుస్తున్న పుట్టినిల్లు ఆశ్రమంలో మంగళవారం ఒంటరి మహిళలకు నిత్యావసర వస్తువులందించారు. ఆదర్శనగర్‌లోని పుట్టినిల్లు ఆశ్రమంలో రెండు నెలల సరిపడా 33 వస్తువులతో నిత్యావసర వస్తువుల కిట్లనందించినట్లు నిర్వాహకులు డాక్టర్ నిర్మలా మురళీ తెలిపారు. మానసిక స్థితి సరిగా లేని కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే వారికి దాతల సహకారంతో తోడ్పానందించామన్నారు.

జాతీయ హాకీ అకాడమీకి ఎంపిక



తల్లిదండ్రులతో విద్యార్థిని లక్ష్మి

ఆత్మకూరు: సనప జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన లక్ష్మి అనే విద్యార్థి భోపాల్ లోని జాతీయస్థాయి హాకీ అకాడమీకి ఎంపికైనట్లు పాఠశాల పీడీ నాగరాజు మంగళవారం తెలియజేశారు. లక్ష్మి ప్రస్తుతం కర్ణాటక మడికెరలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్‌లో శిక్షణ పొంతోందన్నారు. జాతీయ స్థాయి హాకీ అకాడమీకి ఎంపికైన క్రీడాకారులు ముమ్ముందు అంతర్జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు ఎంపికయ్యే అవకాశం ఎక్కువగా ఉందని తెలియజేశారు. లక్ష్మి తల్లిదండ్రులు పాతులయ్య దినకూలీ. తల్లి శివమ్మ ఆశా వర్కర్‌గా పని చేస్తోంది. లక్ష్మిని ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో గావుల మహోత్సవం



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న రుద్రంపేట గ్రామస్తులు

రుద్రంపేటలోని నడిగడ్డ పోతులయ్య స్వామి గావుల మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని స్వామికి సమర్పించారు. అనంతరం గావుల మహోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు జంతు బలులతో మొక్కులు తీర్చుకున్నారు. ఇదిలా ఉండగా జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు డ్రోన్ ద్వారా బందోబస్తును పర్యవేక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ అనంతపురం



పూజలందుకున్న పోతులయ్య స్వామి



పోతులయ్య స్వామి ఆలయం వద్ద భక్తుల సందడి



ఊరేగింపులో పాల్గొన్న పూజారులు

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రసాద్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుస్తకాల పేరుతో 1–5వ తరగతికి రూ.10–15 వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. ఎండాకాలంలో ఒంటిపూట బడులు నిర్వహించాలనే నిబంధనను తుంగలో తొక్కుతున్నారన్నారు. సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు, లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, సహాయ కార్యదర్శి చందు, నగర అధ్యక్షులు మంజునాథ్, సహాయ కార్యదర్శి సమీర్. నాయకులు పవన్, సాయి ఉన్నారు.



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి

రాప్తాడు: సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం రాప్తాడు పంచాయతీలోని ముస్లీం మైనార్టీ కాలనీలో ఉపాధి హామీ కింద రూ.31 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు, డ్రైనేజీలను ప్రారంభించారు. ముందుగా కాలనీలో రోడ్డుపై నిర్మించిన నిర్మాణాలను జేసీబీతో తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎండీడీఓ మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. పనులకు కాలనీ వాసులు సహకరించాలని ఎంపీడీఓ కోరారు. కార్యక్రమంలో మండల ఇంజనీర్ ఓబుల్‌దాస్, పంచాయతీ రాజ్ ఇంజినీర్ కిశోర్‌కుమార్, సర్పంచు సాకే తిరుపాల్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీ కాలనీలో రోడ్డుపై కట్టడాలను తొలగిస్తున్న అధికారులు

ఇష్టారాజ్యం

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగరంలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. మారుమూల ప్రాంతాల నుంచి ప్రధాన రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. చారిత్రాత్మక రైల్వే ఓవర్ బ్రిడ్జి స్థానంలో అర్బన్ లింక్ ప్రాజెక్ట్ పేరుతో రూ.311 కోట్లతో బ్రిడ్జి జిల్లాకే తలమానికంగా నిలిచింది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వంలో దారుణమైన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. నగరం కళాహీనంగా మార్చే దిశగా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. నగరంలోని సూర్యనగర్ సర్కిల్ రోడ్డు అధ్వానంగా ఉండేది. గత ప్రభుత్వంలో రూ.2 కోట్లతో విశాలవంతమైన డబుల్ రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తే.. ఇప్పటి కూటమి ప్రభుత్వంలో అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీ నిర్వాహకులతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని ఇష్టారాజ్యంగా ఎటువంటి టెండర్ ప్రక్రియ చేపట్టకుండా అనుమతులిచ్చినట్లు తెలుస్తోంది. ప్రకటనల బోర్డులను(లాలిపాప్స్)దగ్గర దగ్గరగా వేశారు. ధనార్జనే ధ్యేయంగా అడ్వర్టయిజ్‌మెంట్ ఏజెన్సీ నిర్వాహకులు వ్యవహరిస్తుంటే వారికి వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలున్నాయి. విజన్ 2047 అంటూ కూటమి ప్రభుత్వం ప్రచారం చేస్తోందని, కానీ క్షేత్రస్థాయిలో అటువంటి పరిస్థితి కన్పించడం లేదన్నారు. ఇదే విషయమై టీపీఓ శిరీషకు సాక్షి వివరణ కోరితే ప్రకటనలకు అనుమతిచ్చామని, సరిగా వేయకపోవడంతో ఆపేయాలని ఆదేశించినట్లు చెప్పుకొచ్చారు.



సూర్యనగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన బోర్డులు

ఘనంగా 'పోషణ పక్వాడ' వేడుకలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ -5 సెక్టార్ పరిధిలోని పాపంపేట బిందెల కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడ పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ, ఎంపీటీసీ సభ్యుడు సందీప్ యాదవ్ హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు, 6 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారుల గృహాలను సందర్శించి పౌష్టికాహారం, ఆరోగ్యంపై జాగ్రత్తలను జయశ్రీ వివరించారు. బిడ్డ పుట్టినప్పటినుంచి ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. 7వ నెల నుంచి తల్లిపాలతో పాటు అదనపు ఆహారంలో భాగంగా వైవిధ్యమైన ఆహారం అలవాటు చేయాలన్నారు. కిచిడి, చిక్కటి పప్పు, పెరుగు, పాలు, పాల పదార్థాలు, దుంప కూరలు, పప్పు ధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వేరుశనగ, పసుపు, నారింజ రంగు కూరగాయలు, పండ్లు ఆహారంలో చేర్చాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ వర్కర్ లక్ష్మీదేవి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



పోషణ పక్వాడ ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్ జయశ్రీ

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఉదయం వసంతోత్సవం, ధ్వజ అవరోహణతో పదిరోజుల పాటూ వైభవోపేతంగా సాగిన బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ప్రధాన అర్చకులు వెల్లడించారు. ఈ సందర్భంగా పవిత్ర జలాలతో శ్రీచక్ర పూజలు, ఉత్సవ విగ్రహాలకు అభిషేకించిన జలాలను అందరిపై ప్రోక్షణ చేశారు. పూర్ణాహుతితో హోమాలనూ ముగించారు. సాయంత్రం చివరిరోజు కావడంతో సర్వాంగ సుందరంగా అలంకరించిన ఉత్సవ మూర్తులకు శయనోత్సవం నిర్వహించారు. శ్రీరాముని నివేదన అనంతరం భక్తులకు వితరణ చేయడానికి షిర్డీసాయి స్వీట్స్ వారు పలు రకాల తీపిపదార్థాలను అందించారు. ఈ సందర్భంగా భక్తమండలి సభ్యులు జీజే వేణు, నరేంద్ర చౌదరి, ఎర్రిస్వామి, రాజు తదితరులు మాట్లాడుతూ భక్తాదులందరి సహకారంతో బ్రహ్మోత్సవాలకు భరతవాక్యం పలికామని శ్రీరామ కల్యాణోత్సవంలో పాల్గొన్నవారందరికి ముత్యాల తలంబ్రాలనందించినట్లు తెలిపారు.



శయనోత్సవంలో స్వామివారు

'ఉపాధి' కూలీలకు భృతి అందించాలి



ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

అనంతపురం టౌన్: ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి ఉపాధి భృతిగా రూ.12 వేలు అందించాలని డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం బుక్కరాయసముద్రం మండలాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వద్ద నీడ, మెడికల్ కిట్లు సైతం ఏర్పాటు చేయలేదంటే ఉపాధి కూలీల పట్ల ప్రభుత్వాలు ఎంత మాత్రం చిత్తశుద్ధి ఉందో స్పష్టం అర్థం అవుతోందన్నారు. ఏడాది పాటు కూలీ పనులకు వచ్చే ఉపాధి కూలీలకు ఏడాదికి భృతిగా రూ.12 వేలు ఇవ్వాలన్నారు. ఇందు కోసం ఈనెల 21, 22వ తేదీల్లో పథకాన్ని ప్రవేశపెట్టిన నార్పల మండలం బండ్లపల్లి నుంచి పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. పాదయాత్ర ముగింపు సభ క్లాక్ టవర్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర నేత రామకృష్ణతోపాటు వివిధ రాజకీయ పార్టీ నాయకులు హాజరు అవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాకే నాగరాజు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల పక్షపాతి వైఎస్సార్‌సీపీ

అనంతపురం కార్పొరేషన్: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ..వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించిందని, వైఎస్సార్ సీపీ ముస్లింల పక్షపాతి అని మరోసారి రుజువు చేసిందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టం పూర్తిగా అసంబద్ధంగా, ఒక మతం పట్ల వివక్ష చూపడంతో పాటు, రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందన్నారు. తమ పార్టీఅధిష్టానం ముస్లింల మనోభావాలను కాపాడేందుకు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిందని తెలిపారు. సమావేశంలో మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శులు తబ్రేజ్, వేమల నదీం, నగరాధ్యక్షులు మన్సూర్, కార్పొరేటర్లు రహంతుల్లా, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి బాల విహార్ సమ్మర్ క్యాంప్

అనంతపురం కల్చరల్: ఈనెల 27 నుంచి మే 8 వరకు బాల విహార్ సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు స్వామి ఆత్మవిదానంద సరస్వతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా యోగా, మెడిటేషన్, భగవద్గీత చాంటింగ్, పెయింటింగ్, క్రాఫ్ట్, స్టోరీ టెల్లింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర వాటిల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9440442466, 8121276126 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

అనంతపురం కల్చరల్: స్థానిక ఐదోరోడ్డులో వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద బోనాల కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం ఆలయ పరిసరాలు భక్తుల సందడితో హోరెత్తిపోయాయి. వందల సంఖ్యలో మహిళలు బోనాతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. మంగళవాయిద్యాలతో పాటూ డప్పు చప్పుళ్లతో భక్తిగీతాలనాలపిస్తూ భక్తులు భక్తిప్రవత్తులు చాటుకున్నారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నదానం జరిగింది. కార్యక్రమంలో నిర్వాహకులు రంగా, నాగరాజు, బాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఐదో రోడ్డులోని రేణుకా యల్లమ్మ తల్లి జాతర మంగళవారం కనులపండువగా సాగింది. భక్తజనంతో రోడ్డు కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో నిర్వాహకులు సిద్దప్ప, బీకేరావు, నరసింహులు, హాస్టల్ మారెన్న తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకున్న పెద్దమ్మ తల్లి



అలంకార సేవల్లో రేణుకా యల్లమ్మ తల్లి



భారీ ఎత్తున బోనాలతో తరలి వస్తున్న భక్తజనం

నేరాల నియంత్రణపై అవగాహన



సురక్ష వాహనంలో వీడియోలు ప్రదర్శిస్తున్న పోలీసులు

అనంతపురం: అనంతపురం వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో సురక్ష వాహనం ద్వారా నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో సురక్ష పేరుతో ఏర్పాటు చేసిన వాహనంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్, పార్ట్‌టైం జాబ్ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్ ఫ్రాడ్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై వీడియోలు ప్రదర్శించారు.

గాండ్ల విజయకుమారికి డాక్టరేట్



ఆచార్య జి. నరసింహన్ నుంచి డాక్టరేట్ పొందుతున్న విజయకుమారి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని తెలుగు ,తులనాత్మక అధ్యయన శాఖ విభాగంలో పరిశోధన చేసిన గాండ్ల విజయకుమారికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆచార్య జి. నరసింహన్ పర్యవేక్షణలో 'స్వేచ్ఛ- కొన్ని సమయాల్లో కొందరు మనుషులు, నవలలపై తులనాత్మక పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు. ఈమె ప్రస్తుతం జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

ఖో-ఖోలో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర

అనంతపురం: ఈ నెల 12,13వ తేదీల్లో కదప కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో కేఎస్ఆర్ఎం–ట్రోఫీ నిర్వహించారు. ఇందులో ఖోఖో ఆటలో ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బి. ఆదర్స్(సి)టీం అద్భుత ఆటతీరు కనబరిచి రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, స్పోర్ట్స్ ఇంచార్జ్ శివానంద, అధ్యాపకులు డాక్టర్ పి. ఖాసీం వలి, బి. రాజేష్‌బాబు విద్యార్థులను అభినందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పత్రిక ప్రకటన

ఇందుమూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయడం ఏమనగా, మా క్లైంటుగారైన [illegible] రెడ్డి వయస్సు : 24 సం॥, (ఆధార్ నెం. 7826 1162 4170), సెల్ నెం. 81792 97240, అనంతపురము [illegible] వయస్సు 64 సం॥, (ఆధార్ నెం. 2863 7797 3815) తండ్రి: లేట్. ఎం.సోమశేఖర రెడ్డి, డోర్ నెం. 6/956, మారుతినగర్, అనంతపురము టౌన్, అనంతపురము జిల్లా. ప్రస్తుత నివాసం: # 9119, Eagles Brook Court, Cypress, Texas-77433 USA, Passport. No. 588952502, [illegible] G.P. పొందిన ఏజెంటు అయిన [illegible] రమణ, వయస్సు 64సం॥ (ఆధార్ నెం. 6316 3731 3019) తండ్రి లేట్ ఎం.సోమశేఖర రెడ్డి, Flat No. 501, Bay Laurel, The Botanika, Behind The Platina, Gachibowli, Hyderabad, K.V.Ranga Reddy District, Telangana State. గారి నుండి ఈ క్రింది షెడ్యూలు దాలా ఆస్తిని [illegible]. సదరు [illegible] రమణ గారికి 1వ పుస్తకం, దస్తావేజు నెం. 30182/2024 ద్వారా సంక్రమించినది.

[illegible] ఈ క్రింద షెడ్యూలు దాలా ఆస్తికి [illegible] ఏమైనా అభ్యంతరాలు వున్నచో నాకు గాని, మా క్లైంటుకు గాని 7 రోజుల లోపు తెలియజేయవలెను. 07 రోజులకు గాని, అంతకు లోపు గాని ఏలాంటి అభ్యంతరాలు [illegible] ఈ క్రింద తెలిపిన షెడ్యూలు దాలా ఆస్తి అమ్మబడునని తెలియజేస్తున్నాము.

షెడ్యూలు

అనంతపురం ఆర్.డి. అనంతపురము సబ్.డి.కి చేరిన అనంతపురము గ్రామపాలం, అనంతపురము మునిసిపల్ నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి వివరము.

Ward	T.S.No.	Plot. No.	A.C.	H.S.	Door. No.	Asst. No.
Old: 6	233/1పైకి	19 పైకి	0.08.264	0.034	Old-6-601	Old-4669
Present-6					Present: 6-3-951	Present : 1001046654

H.S.C No. 16314
0004020159

ఇందుకు చెక్కుబంది:- తూర్పు : రోడ్డు, దక్షిణం : రోడ్డు, పడమర : బి. [illegible] గారి పాత డోర్.నెం. 6/602 గల ఇల్లు, ఉత్తరం : M. రామ రమణ గారి ప్రస్తుత డోర్.నెం. 6-3-950 గల ఇల్లు. ఈ మధ్య గల తూర్పు–పడమర: 60 అడుగులు లేక 18.29 మీటర్లు, ఉత్తరం–దక్షిణం: 60 అడుగులు లేక 18.29 మీటర్లు, ఈ విశాలం గల 400 చ॥గజాల గల బయలు, ఈ బయలులో 1200 చ॥అడుగులలో కట్టబడిన ఇల్లు బయలుతో సహా.

ఎస్. రవికుమార్ రెడ్డి, అడ్వకేట్, అనంతపురము. సెల్: 9848260180